ప్రజాశక్తి
ఆదివారం 26 మే 2024 5 అనంతపురం






పుట్లూరు మండలంలో నేలకొరిగిన అరటి పంట

పంటలపై ఈదురుగాలులు

నేలకొరిగిన అరటి, మొక్కజొన్న

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలో శుక్రవారం రాత్రి వీచిన ఈదురు గాలులకు పలు గ్రామాల్లో అరటి, మొక్కజొన్న పంటలు నేలకొరిగాయి. కడవకల్లు, సూరేపల్లి, సంజీవపురం, ఓబులాపురం తదితర గ్రామాల్లో అరటి మొక్కజొన్న చెట్లు నెలకూలాయి. దాదాపు 100 ఎకరాలకు పైగా పంటలు దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. మరో రెండు నెలల్లో పంట చేతికొచ్చే సమయంలో ఇలా ఈదురు గాలులకు నేలమట్టం కావడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అరటికి ఎకరాకు రూ.1.50 లక్షలు వరకు పెట్టుబడులు అయ్యాయి. ఇలాంటి సమయంలో పంట నష్టపోవడంతో పూర్తిగా నష్టాన్ని తెచ్చిపెట్టిందని రైతు పుల్లారెడ్డి తెలియజేశారు. మూడు ఎకరాల్లో సాగు చేసిన అరటి పంట మొత్తం శుక్రవారం రాత్రి వీచిన ఈదురుగాలులకు నేలమట్టం అయిదన్నారు. దాదాపు రూ.5 లక్షలు నష్టపోయినట్లు రైతు తెలిపాడు. సంబంధిత అధికారులు నష్టపోయిన పంటను పరిశీలించి నష్టపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.



నీరు చేరిన కబ్బాల వంక వేదవతి

వాగులకు జలకళ

బొమ్మనహాల్ : ఇటీవల కురుస్తున్న వర్షాలకు బొమ్మనహాల్ మండలంలోని పలు వాగులు, చెరువులకు జలకళ సంతరించుకుంటోంది. శుక్రవారం నాడు మండలంలో 34 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మండలంలోని వేదవతి నది, కబ్బాల్ వంకకు నీటి ప్రవాహం వస్తోంది. వర్షాలు ప్రారంభంలోనే వాగులకు నీరు చేరుతుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మేలో వర్షాలు మెండు..!



సాధారణం కంటే 300 శాతం అధికం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సాధారణంగా మే నెలలో మండే ఎండలు అని అనుకుంటాం. మే మొదటి వారం వరకు కూడా అదే వాతావరణ పరిస్థితులు జిల్లాలో ఉన్నాయి. మే మొదటి వారంలో 43 డిగ్రీల వరకు ఎండలుండేవి. రెండవ వారం నుంచి ఆకాశం మేఘావృతమై అప్పుడప్పుడు వర్షాలు పడుతుండటంతో వాతావరణం కాస్త చల్లబడింది. మూడవ వారంలో అల్పపీడన ప్రభావంతో వర్షాలు కూడా పడుతున్నాయి. ఈ ఏడాది మే నెలలో వర్షాలు మెండుగా వచ్చాయి. సాధారణం కంటే 300 శాతం అధికంగా వర్షపాతం నమోదవడం గమనార్హం. గతేడాది ఇదే నెలలో 74.5 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదవగా ఈసారి ఇప్పటి వరకు 103.5 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయింది. మేలలో సాధారణ వర్షపాతం చూస్తే 25.8 మిల్లీమీటర్లు మాత్రమే. అంటే మే నెలలో సాధారణ వర్షపాతం కంటే 300 శాతం అధికంగా వర్షపాతం నమోదయింది.

సీజన్ ముగింపులో వర్షాలు

2023-24 సీజన్‌లో వర్షాభావ పరిస్థితులు నెలకుని ఉంటూ వచ్చాయి. జూన్ నుంచి ఫిబ్రవరి వరకు ప్రతి నెలా వర్షభావ పరిస్థితులే జిల్లాలో నెలకుని ఉండేవి. జూన్ నుంచి మే వరకు సాధారణ వర్షపాతం 501.6 మిల్లీమీటర్లు కురవాల్సి ఉండగా ఇప్పటి వరకు 397.4 మిల్లీమీటర్లు మాత్రమే నమోదయింది. అందులో మే నెలలోనే 104.1 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయింది. మేలో వర్షాలు లేకపోతే జిల్లాలో ఇప్పటి వరకు 293.3 మిల్లీమీటర్లు మాత్రమే పడి ఉండేది. ఎప్పుడూలేని విధంగా ఈసారి మే నెలలో అత్యధిక వర్షాలు పడ్డాయి. ఇక మండలాల వారీగా చూస్తే శెట్టూరు మండలంలో అత్యధికంగా వర్షపాతం నమోదయింది. శెట్టూరు మండలంలో సాధారణ వర్షపాతం 26.1 మిల్లీమీటర్లు అయితే 171.9 మిల్లీమీటర్లు నమోదయింది. సాధారణం కంటే 551 శాతం అధికంగా వర్షపాతం నమోదయింది. ఆ తరువాత కుందుర్పి మండలంలో 27.3 మిల్లీమీటర్లు సాధరణ వర్షపాతమయితే 140.9 మిల్లీమీటర్లు వర్షపాతం పడింది. ఉరవకొండలో గరిష్టంగా 601.7 శాతం వర్షపాతం అధికంగా నమోదయింది. అక్కడ సాధారణ వర్షపాతం 29.4 మిల్లీమీటర్లు అయితే పడిన వర్షం 206.3 మిల్లీమీటర్లు ఇలా జిల్లాలో అన్ని మండలాల్లోనే మే నెలలో అధిక వర్షపాతమే నమోదయింది.

జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు

ఈనెల 25వ తేదీన జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు పడ్డాయి. సగటున 22 మిల్లీమీటర్లు వర్షపాతం శనివారం నాడు నమోదయింది. కళ్యాణదుర్గంలో అత్యధికంగా 86.4 మిల్లీమీటర్లు పడింది. కణేకల్‌లో 70 మిల్లీమీటర్లు నమోదవగా, ఉరవకొండలో 62 మిల్లీమీటర్లు వర్షపాతం పడింది. కుందుర్పిలో 58.6మిల్లీమీటర్లు, వజ్రకరూరులో 46.2 మిల్లీమీటర్లు నమోదయింది. యల్లనూరు, నార్పల మినహా తక్కిన అన్ని మండలాల్లో ఒక మోస్తరు వర్షపాతం శనివారం నాడు నమోదయింది.



జెఎన్‌టియులో స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

కౌంటింగ్‌కు పకడ్బందీ చర్యలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఎన్నికల కమిషన్ మార్గనిర్దేశకాల ప్రకారం సాధారణ ఎన్నికల కౌంటింగ్ కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వి.వినోద్‌కుమార్, ఎస్పీ గౌతమిశాలి తెలియజేశారు. అనంతపురం నగరంలోని జెఎన్‌టియులో సాధారణ ఎన్నికల దష్ట్యా ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కౌంటింగ్ కోసం ఏర్పాట్లు అన్ని ముందస్తుగానే పూర్తి చేయాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లోకి అధికారులు, అభ్యర్థులు, ఏజెంట్లు వెళ్లేందుకు బ్యారీకేడింగ్ చేపట్టాలన్నారు. జెఎన్‌టియు అవసరమైనచోట సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. వాటి ఫీడింగ్ అంతా పోలీసు కంట్రోల్ రూమ్‌లో వచ్చేలా చూడాలన్నారు. కౌంటింగ్ కోసం చేపట్టాల్సిన ఏర్పాట్లు అన్నీ వెంటనే మొదలుపెట్టి పక్కగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో టేబుల్స్, కుర్చీల ఏర్పాటు, కౌంటింగ్ సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, మైక్రో అబ్జర్వర్లకు సీటింగ్ ఏర్పాటు, ఏజెంట్లకు కూర్చునేందుకు ఏర్పాట్లు, టవర్ ఏసీల ఏర్పాట్లు సకాలంలో చేయాలన్నారు. గుర్తింపు కార్డు లేకుండా కౌంటింగ్ కేంద్రంలోకి ఎవరికీ అనుమతి లేదన్నారు. ఎస్పీ గౌతమి శాలి మాట్లాడుతూ సాధారణ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను నిర్వహించేందుకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టామన్నారు. స్ట్రాంగ్ రూముల వద్ద మూడంచెల భద్రత ఉంటుందన్నారు. కౌంటింగ్ పూర్తయ్యేంత వరకూ నిరంతరం నిఘా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్, అడిషినల్ ఎస్పీ లక్ష్మీనారాయణ రెడ్డి, నోడల్ అధికారులు అప్పాజీ, ఓబుల్ రెడ్డి పాల్గొన్నారు.

రైతుల ఆశలపై 'నీళ్లు'..

శిథిలమైన హెచ్చెల్సీ కాలువలు
ఐదేళ్లలో పైసా విడుదల కాని నిధులు
ప్రశ్నార్థకంగా సాగునీరు
ఆందోళనలో అన్నదాతలు





దుస్థితికి చేరుకున్న కాలువ గోడలు



మరమ్మతులకు గురైన హెచ్చెల్సీ కాలువ

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

పదేళ్లుగా అతివృష్టి, అనావృష్టి, కరవు కాటకాలతో అల్లాడిపోతున్న రైతులకు ప్రధాన వనరు అయిన హెచ్చెల్సీ కాలువలు ఏడాదికేడాది దయనీయంగా మారుతున్నాయి. గడిచిన ఐదేళ్లలో కాలువల మరమ్మతులకు ప్రభుత్వం కనీసం పైసా నిధులు ఇవ్వలేదు. దీనికితోడు కేవలం కాలువల రహదారులకు ఎర్రమట్టిని (గ్రావెల్) తరలించి తూతూమంత్రంగా పనులు కొనసాగించారు. దీంతో మిడుతూరు నుంచి చివరి ఆయకట్టు గ్రామాలైన చిటూరు, కండ్లగూడూరు ప్రాంతాల రైతులకు సాగు నీరు కష్టతరంగా మారింది. ప్రస్తుతం కాలువలు శిథిలావస్థకు చేరి పొలాలకు సాగునీరు పెట్టుకోవాలంటే రైతులు అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. మండలవ్యాప్తంగా దాదాపు 20వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. అయితే ఇలాంటి కాలువల ద్వారా చివరి ఆయకట్టుకు సాగునీరు అందించడం ప్రశ్నార్థకం అని చెప్పవచ్చు. ఇప్పటికే ఏటా చివరి ఆయకట్టు ప్రాంతాల రైతులు నీటి కోసం వేచి చూడాల్సిన పరిస్థితి దాపురిస్తోంది. గతేడాది కాలువలకు సాగునీరు సరిగా అందించకపోవడంతో కాలువలు దుస్థితి మారిపోయాయి. కాలువల

మరమ్మతులకు నిధుల కొరత

ప్రధాన కాలువలకు హెచ్చెల్సీ అధికారులు ఏటా నిధులు మంజూరు చేయాల్సి ఉండగా గడచిన ఐదేళ్లలో మరమ్మతులకు పైసా నిధులను విడుదల చేయలేదు. దీంతో పెద్దవడుగూరు, చిన్నవడుగూరు, దిమ్మగుడి, లక్షులపల్లి ప్రాంతాల్లోని డిస్ట్రిబ్యూటరీ కాలువల రూపురేఖలే మారిపోయాయి. కనీసం ధ్వంసమైన డిస్ట్రిబ్యూటరీ కాలువకు మరమ్మతులు చేయించేందుకు కూడా అధికారులు నిధులు విదల్చకపోవడంతో రైతుల ఆందోళన చెందుతున్నారు. మిడుతూరు వద్ద జమ్ము గడ్డి అధికంగా పెరిగి నీటి ప్రవాహానికి అడ్డంగా మారడంతో ఎమ్మెల్యే చొరవతో వాటిని తొలగించిన విషయం తెలిసిందే. తర్వాత మిడుతూరు నుంచి ఆవులాంపల్లి వరకూ ఉపాధి పథకం కింద పూడికతీత పనులు చేపట్టారు. డిస్ట్రిబ్యూటరీ కాలువలు, సైడువాల్స్ పూర్తిగా దెబ్బతిని సాగునీటిని పొలాలకు తరలించాలంటే రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఈవిషయంపై హెచ్చెల్సీ ఎఇ మానసను విచారించగా రహదారుల మరమ్మతులకు మాత్రమే నిధులు విడుదల అయ్యాయని, కాలువల మరమ్మతులకు నిధులు విడుదల కాలేదని వివరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి హెచ్చెల్సీ కాలువల మరమ్మతులకు నిధులు మంజూరు చేసి చివరి ఆకకట్టు వరకూ నీరు అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.



పూర్తిగా దెబ్బతిన్న హెచ్చెల్సీ కాలువ



రైల్వే గేటు వద్ద దిగబడిన ఎరువుల లారీ

రైల్వే గేటు వద్ద ఒరిగిన ఎరువుల లారీ

రాయదుర్గం : పట్టణంలోని బిటిపి రోడ్డు రైల్వే గేటు ఎల్‌సి నెంబర్ 94 సమీపంలో ఎరువుల లోడుతో గుమ్మగట్ట వైపు వెళ్తున్న లారీ శనివారం ఉదయం దిగబడింది. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అడుగుప్ప రోడ్డు అండర్ పాస్ వద్ద సైడ్‌క వెళ్లగా ఉన్నట్టుండి దిగబడింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. వెంటనే రోడ్లు, భవనాల శాఖ అధికారులు స్పందించి క్రేన్ సాయంతో లారీని తొలగించారు. వాన నీటి మళ్లింపు కాలువ కోసం రోడ్డును తవ్వడంతో అక్కడ మట్టి దిగబడింది. ఈ విషయాన్ని రైల్వే లెవెల్ క్రాసింగ్ సిబ్బంది నైరుతి రైల్వే మైసూర్ డివిజన్ ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.



నాణ్యమైన విత్తనకాయలనే తీసుకెళ్లండి

అనంతపురం ఎడిఎ ఎం.రవి - కొనసాగిన విత్తన పంపిణీ

ప్రజాశక్తి-అనంతపురం

ప్రభుత్వం రైతులకు పంపిణీ చేస్తున్న వేరుశెనగ కాయల బస్తాలను రైతు భరోసా కేంద్రాల్లోనే పరిశీలించి నాణ్యమైన విత్తనకాయలనే తీసుకెళ్లాలని అనంతపురం వ్యవసాయ శాఖ డివిజన్ ఎడిఎ ఎం.రవి అన్నారు. విత్తన పంపిణీ పరిశీలనలో భాగంగా శనివారం అనంతపురం రూరల్ మండల వ్యవసాయ అధికారి జె.శశికళతో కలిసి ఇటుకులపల్లి, ఉప్పరపల్లి, ఆర్‌బికెల్లో చేపట్టిన విత్తన పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్సిడీ వేరుశనగ కావాల్సిన రైతులు రిజిస్ట్రేషన్ చేసుకుని 40శాతం సబ్సిడీతో తీసుకెళ్లాలన్నారు. అయితే విత్తనకాయల బస్తాలను ఆయా ఆర్‌బికెల్లోనే పరిశీలించి నాణ్యమైన విత్తనకాయలను తీసుకెళ్లాలన్నారు. నాణ్యత లేకుండా ఆర్‌బికె సిబ్బందికే అప్పగించాలన్నారు. అనంతరం రాచానపల్లి, కామారుపల్లి, కురుగుంట ఆర్‌బికెల్లో చేపట్టిన విత్తన పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల విస్తరణ అధికారులు బి.మురళీకృష్ణ, అలేఖ్య, ఆర్‌బికె సిబ్బంది లక్ష్మీదేవి, హేమ, తదితరులు పాల్గన్నారు.

52,781 మంది రిజిస్ట్రేషన్

జిల్లాలోని 29 మండలాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో 52,781 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారిణి యు.ఉమామహేశ్వరమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విత్తనకాయల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్న వారి ప్రకారం 46,588 క్వింటాళ్లు అవసరం అవుతాయన్నారు. ఇందులో భాగంగా ఇప్పటికి 37, 889 క్వింటాళ్ల విత్తనకాయలను ఆయా రైతు భరోసా కేంద్రాల్లో నిల్వ ఉంచినట్లు తెలిపారు. కాగా జిల్లావ్యాప్తంగా విత్తన పంపిణీ కొనసాగుతోందన్నారు. రెండు రోజులుగా 24,440 మంది రైతులకు 23,500 క్వింటాళ్ల విత్తనకాయలు రైతులకు పంపిణీ చేసినట్లు తెలిపారు.



విత్తనకాయలను పంపిణీ చేస్తున్న అధికారులు

శింగనమల : మండల వ్యాప్తంగా రిజిస్టర్ చేసుకున్న రైతులందరికీ విత్తన వేరుశనగకాయలను అందించాలని ఎఒ అన్వేష్‌కుమార్ సంబంధిత సిబ్బదిని ఆదేశించారు. ఈమేరకు మండలవ్యాప్తంగా రెండోరోజు శనివారం కూడా విత్తనపంపిణీ కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా రెండు రోజుల నుంచి 1070 మంది రైతులకు 885.3 క్వింటాళ్ల రాయితీ వేరుశనగ పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇంకా మండలానికి 914 క్వింటాళ వేరుశనగ పంపిణీ చేయాల్సి ఉందన్నారు.

వజ్రకరూరు : విత్తన వేరుశనగ కాయల పంపిణీ పకడ్బందీగా చేపట్టాలని డిడిఎ శివకుమార్ వ్యవసాయ అధికారులకు సూచించారు. శనివారం ఉరవకొండ, లత్తవరం రైతు భరోసా కేంద్రాలతోపాటు విడపనకల్ మండల పరిధిలోని చీకలగురికి, ఉండబండ, పాల్తూరు, కరకముక్కల గ్రామాల్లో చేపట్టిన విత్తన వేరుశనగ కాయల పంపిణీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా వేరుశెనగ కాయలు తీసుకున్న రైతుల వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. అలాగే రైతులు కట్టిన డబ్బులను ఎప్పటికప్పుడే ఏపీ సీడ్స్ వారికి జమ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ ఎడిఎ పద్మజ, ఉరవకొండ, విడపనకల్ మండలాల వ్యవసాయ అధికారులు శుభకర్, పెన్నయ్య, రైతు భరోసా సిబ్బంది లక్ష్మీదేవి, గోపాల్‌నాయక్, లక్ష్మన్న, జీవన్‌కుమార్, మెర్సీ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కక్షతోనే కార్మికుల వేతనాలు నిలుపుదల

- శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కాంట్రాక్టర్ శివశంకర్ రెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నీలకంఠాపురం శ్రీరామిరెడ్డి సాగునీటి పథకం కింద పని చేసే ఉద్యోగుల పట్ల కక్షపూరితంగా వ్యవహరించి మూడు నెలలుగా జీతాలు నిలిపివేసిన కాంట్రాక్టర్ శివశంకర్ రెడ్డిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార పార్టీకి అనుకూలంగా లేరన్న ఉద్దేశంతో 21 మంది కార్మికులకు మూడు నెలల నుంచి వేతనాలు వేయకుండా కక్షపూరితంగా కాంట్రాక్టర్ శివశంకరరెడ్డి వ్యవహరిస్తున్నారన్నారు. కార్మికులకు మూడు నెలలు బకాయి వేతనాలు, పిఎఫ్ 13శాతం వెంటనే చెల్లించాలన్నారు. కార్మికులకు చెల్లిస్తున్న వేతనాల్లో ప్రతి కార్మికుని నుంచి రూ.2,200 కోత కోయడం దారుణం అన్నారు. చట్టవిరుద్ధంగా కోత విధించిన సొమ్మును కార్మికులకు వెనక్కు ఇచ్చేయాలన్నారు. 2023-24 డిసెంబర్, జనవరి నెలల జీతాలు ఎవరు వేస్తారన్న దానిపై కూడా స్పష్టత ఇవ్వని పరిస్థితి ఉందన్నారు. ఇక వేతనాలు అడుగుతున్న కార్మికులపై అక్రమ కేసులు బనాయించడానికి ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారులు కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై కార్మికులను నిత్యం వేధిస్తుండడం దుర్మార్గం అన్నారు. కార్మికులు వేతనాలు కావాలంటే ప్రతినెలా ఆందోళనలు, సమ్మె చేయాల్సిన పరిస్థితులను ప్రభుత్వం, అధికారులు కల్పిస్తున్నారని తెలియజేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఒకే పథకాన్ని ముక్కలు ముక్కలుగా చేసి కాంట్రాక్టర్ గొప్ప చెప్పడం పెద్ద దోపిడీ అన్నారు. మడకశిర, హిందూపురం ప్రాంతాల్లో నిర్వహణ ఉన్న కాంట్రాక్టర్లు కళామనాయుడు, గోవర్ధన్‌రెడ్డి 18 నెలలుగా కార్మికులకు పిఎఫ్ చెల్లించలేదన్నారు. వారిపైన ఇప్పటి వరకు ఎటువంటి చర్యలూ తీసుకోలేదన్నారు. ఫేస్-4కింద రాయదుర్గం, కళ్యాణదుర్గం డివిజన్‌లో లైన్‌మెన్లు, పంపు ఆపరేటర్లు, ఫిట్టర్లు దాదాపు195 మంది కార్మికులు పనిచేస్తున్నారన్నారు. నీటి సరఫరాలో లీకేజీలు అయితే మరమ్మతుకు అవసరం అయ్యే వస్తువులను కార్మికులే తెచ్చుకుని వేధిస్తున్నారన్నారు. ఈ సమస్యలన్నింటిపై సంబంధిత అధికారులు స్పందించి కార్మికులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.

తాడిపత్రి పాలిటెక్నిక్ కళాశాలలో
పాలిసెట్ కౌన్సిలింగ్‌కు ఏర్పాట్లు

ప్రజాశక్తి-తాడిపత్రి

తాడిపత్రిలోని ఆటోనగర్ సమీపంలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్ కౌన్సిలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపాల్ జి.శైలేంద్రకుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించిన రసీదుతోపాటు ఒరిజినల్ సర్టిఫికెట్లు రెండు సెట్ల జిరాక్స్ కాపీలతో ఇప్పటికే ప్రకటించిన తేదీల్లో ఉదయం 9గంటలకు హాజరుకావాలని కోరారు. మే 27 నుంచి జూన్ 3వ తేదీన వరకు ధ్రువపత్రాల పరిశీలన, మే 31 నుంచి జూన్ 6 వరకూ వెబ్‌ఆప్షన్స్ నమోదు ఉంటుందన్నారు. 27వ తేదీ 1 నుంచి 12000 ర్యాంకు, 28వ తేదీ 12001 నుంచి 27000, 29వ తేదీ 27001 నుంచి 43000 వరకూ, 30వ తేదీ 43001 నుంచి 59000 వరకూ, 31వ తేదీ 59001 నుంచి 75000 వరకూ, జూన్ 1న 75001 నుంచి 92000 వరకూ, 2న 92001 నుంచి 1,08,000 వరకూ, 3న 1,08,001 నుంచి చివరి ర్యాంకు వరకు కౌన్సిలింగ్ ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు హెల్ప్‌లైన్ నెంబర్ 94937 73778ను సంప్రదించాలని కోరారు.

రాష్ట్రంలో వైసిపిదే గెలుపు

తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, గోరంట్ల మాధవ్

ప్రజాశక్తి-అనంతపురం

సార్వత్రిక ఎన్నికల్లో గెలవబోయేది వైసిపినే అని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. శనివారం అనంతపురంలో ఎంపి గోరంట్ల మాధవ్ నివాసంలో ఆయనతో కలిసి విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 14 అసెంబ్లీ, రెండు ఎంపీ సీట్లలో వైసిపి గెలవబోతోందని జోస్యం చెప్పారు. హిందూపురంలో బాలకృష్ణ, కుప్పంలో చంద్రబాబు, పిఠాపురంలో పవన్‌కళ్యాణ్ ఓడిపోతున్నారన్నారు. రాష్ట్రంలో 164 అసెంబ్లీ సీట్లలో వైసిపి గెలవబోతోందని, కేవలం 4 సీట్లకు మాత్రమే చంద్రబాబు పరిమితం కాబోతున్నారన్నారు. బిజెపి, జనసేన 7 సీట్లలో గెలవబోతోందన్నారు. టిడిపి గెలుస్తుందని పందేలు ఆడి ఎవరూ మోసపోవద్దన్నారు. సంక్షేమ పథకాలకు మద్దతుగా, ప్రభుత్వం చేసిన సాయానికి మద్దతుగా ఓటింగ్ జరిగిందని, రాష్ట్రంలో జగనన్న ప్రభంజనం నడిచిందన్నారు. ఎంపి గోరంట్ల మాధవ్ మాట్లాడుతూ ఎన్నికలు ముగిసిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్సార్ జగన్‌మోహన్‌రెడ్డి 152కు పైగా ఎమ్మెల్యే స్థానాలు, 22కు పైగా ఎంపీ స్థానాలు గెలవబోతున్నామని చేసిన ప్రకటనతో తెలుగుదేశం పార్టీ నాయకుల గుండెలు పగిలిపోయాయన్నారు. జూన్ 9 ఉదయం 9.38 నిముషాలకు, విశాఖపట్నం రుషికొండలో జగన్మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయబోతున్నారన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ప్రకాష్‌రెడ్డి, మాధవ్

అడకత్తెరలో అధికారులు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అడకత్తెరలో పోకచెక్కలా తయారయింది అధికారుల పరిస్థితి. మే 13వ తేదీన జరిగిన సార్వత్రిక ఎన్నికల సమయంలో తాడిపత్రిలో చోటు చేసుకున్న ఘర్షణకు అధికారులపై వరుసగా వేటు పడుతున్నాయి. కేంద్ర ఎన్నికల సంఘం ఘర్షణను సీరియస్‌గా తీసుకుని జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్‌పై వేటు వేసింది. ఈయనతోపాటు డీఎస్పీ గంగయ్య, సిఐ మురళీకృష్ణలపైనా వరుసగా వేటుపడ్డాయి. అంతటితోనే కాకుండా ఈ మొత్తం వ్యవహారంలో వైఫల్యాలను ఎత్తి చూపాలని ప్రత్యేక విచారణ బృందాన్ని నియమించింది. ఈ విచారణ బృందం గత వారంలో తాడిపత్రిలోనే మకాం వేసి మొత్తం వివరాలను ఆరా తీస్తోంది. ఎక్కడ వైఫల్యం జరిగింది. ముందుగా గుర్తించి ఎందుకు నివారించకలేకపోయారు. అన్న పూర్తి వివరాలను సేకరించే పనిని ప్రత్యేక విచారణ బృందం చేపడుతోంది. ఇదే సమయంలో జిల్లాకు కొత్త ఎస్పీని నియమించింది. గౌతమి శాలి బాధ్యతలు చేపట్టారు. మొదట జరిగిన పరిణామాలను చూసి ఆమె ఎన్నికల ఫలితాల లెక్కింపు సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఏ విధంగా చర్యలు తీసుకోవాలన్న అంశాలపై దృష్టి సారించారు. ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నారు. ఏ చిన్న తప్పు జరిగినా ఎన్నికల సంఘం వేటు పడే అవకాశాలున్నందున క్షేత్రస్థాయి సిబ్బందిని అప్రమత్తం చేసే పనిని చేపట్టింది. జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ కూడా ఓట్ల లెక్కింపుపై దృష్టి సారించారు. ఎక్కడా ఎటువంటి సమస్యల్లేకుండా జాగ్రత్తగానూ, సజావుగా పూర్తయ్యే విధంగా చూసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక ఓట్ల లెక్కింపునకు సమయం దగ్గరపడుతున్న కొద్దీ రాజకీయంగానూ ఉత్కంఠత నెలకొంది. అభ్యర్థులు పోలింగ్ జరిగిన తీరుతోపాటు, ఏ ప్రాంతంలో ఎన్ని ఓట్లు వస్తాయన్న మదింపు వేసుకునే పనిలోనున్నారు. ఇంకోవైపు గెలుపోటములపై పెద్దఎత్తున బెట్టింగ్‌లు నడుస్తున్నాయి. ఏ పార్టీ అధికారంలోకి వస్తుంది... ఏ అభ్యర్థి విజయం సాధిస్తారు తదితర అంశాలతో జోరుగా బెట్టింగ్ నడుస్తుండటం గమనార్హం. రాజకీయ వాతావరణం ఈ రకంగా ఉండే వాతావరణం మాత్రం చల్లబడింది. మే మొదటి వారం వరకు పెద్దఎత్తున ఎండలు మండినప్పటికీ రెండవ వారం నుంచి వర్షాలు పడుతుండటంతో వాతావరణం చల్లబడింది. గత వారంలోనూ జిల్లాలో విస్తారంగా వర్షాలు పడ్డాయి. గతేడాది వర్షాభావం ఎదుర్కొన్న రైతాంగం ఈసారి ముందస్తు వర్షాలతో ఉత్సహం నెలకొంది. సబ్సిడీ విత్తనకాయల పంపిణీ కూడా ప్రారంభమవడంతో విత్తనాలు కొనుగోళ్లు, సాగుకు పొలాలను సిద్ధం చేసుకోవడం వంటి పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. ఖరీఫ్‌కు సన్నద్ధమవుతున్నారు. మే ఆఖరు వారంలలోనే జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు పడ్డాయి. ఇది ఆనందించదగిన విషయం. జూన్ మొదటి వారంలోనే నైరుతి రుతుపవనాలు కూడా వస్తాయని వాతావరణ శాఖ చెబుతోంది. అంటే ఈ ఏడాది సీజన్ ప్రారంభంలో మంచి వర్షాలే పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. వర్షాలు బాగా వచ్చే అవకాశాలుండటంతో సాగుకు సమయత్తమయ్యే రైతులు విత్తు కోసం వెతుకులాట ప్రయత్నంలో ఉన్నారు. బ్యాంకులు, ఇతర ప్రయివేటు వ్యాపారులతో వడ్డీకి డబ్బులు సమకూర్చుకునే పనిలో పడ్డారు. ఇదే వాతావరణం కొనసాగితే జూన్ నెలలోనే విత్తనాలు విత్తుకునే పనిలో పడ్డారు.


హనుమంతు వాహనంపై ఊరేగుతున్న లక్ష్మీనరసింహుడు

హనుమద్ వాహనంపై లక్ష్మీనరసింహుడు

ప్రజాశక్తి- వజ్రకరూరు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా పెన్నోబిలం శ్రీలక్ష్మీ నరసింహస్వామి శనివారం సాయంత్రం హనుమంతు వాహనంపై ఊరేగించారు. ముందుగా స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవమూర్తులను హనుమంత వాహనంపై కొలువుదీర్చి ఊరేగించారు. వాహనసేవకు భారీగా భక్తులు తరలిరావడంతో పెన్నోబిలం కిటకిటలాడింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ విజయ్‌కుమార్, అర్చకులు ద్వారాకనాథ్‌స్వామి, బాలాజీస్వామి, గుండురావు స్వామి, ఉత్సవదాతలు, ఆలయ సిబ్బంది, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు

పెన్నోబిలం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శనివారం నుంచి ఆలయ పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఇఒఆర్‌డి చంద్రమౌళి మాట్లాడుతూ ఈనెల 28న జరుగే బ్రహ్మ రథోత్సవానికి లక్షలాదిమంది భక్తులు తరలిరానుండటంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు పారిశుధ్య పనులు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో పెన్నోబిలం ఆలయ ఇఒ విజయ్‌కుమార్, షేక్షానుపల్లి, చిన్నముష్టూరు గ్రామ కార్యదర్శులు రాఘవ, రమణకుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పిడుగుపాటుకు ఎనుములు మృతి

పెద్దపప్పూరు : మండల పరిధిలోని సింగనగుంటపల్లి గ్రామానికి చెందిన రైతు నారాయణస్వామి పాడి పశువులు పిడుగుపాటుకు గురై మృతిచెందాయి. శుక్రవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతోపాటు పిడుగులు పడటంతో రెండు ఎనుములు మృత్యువాత పడ్డాయి. దీంతో సుమారు రూ.50వేల వరకూ నష్టం సంభవించింది. ఎనుములతో జీవిస్తున్న తాము జీవనోపాధి కోల్పోయామని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

టపాసులు స్వాధీనం

పుట్లూరు : మండల కేంద్రంలో రూ.10వేలు విలువజేసే పటాసులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రంలో సూర్యారెడ్డి అనుమతి లేకుండా టపాసులు విక్రయిస్తుండగా దాడి చేసి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

12 మంది బైండోవర్

పుట్లూరు : త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల కౌంటింగ్‌ను పురస్కరించుకుని దాదాపు 12మందిని బైండోవర్ చేసినట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. ముందస్తు చర్యలో భాగంగా మండల వ్యాప్తంగా 12 మందిని బైండవర్ చేసి తహాశీల్దార్ కార్యాలయంలో తహాశీల్దార్ మల్లికార్జునస్వామి వద్ద హాజరు పరిచినట్లు తెలిపారు.

విద్యాకానుకల స్టాక్ పాయింట్ పరిశీలన


విద్యా కానుకలను పరిశీలిస్తున్న డిఇఒ వరలక్ష్మి

నార్పల : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్‌లో పాఠ్యపుస్తకాలు, విద్యా కానుక కిట్లను జిల్లా విద్యాశాఖ అధికారిణి వరలక్ష్మి శనివారం ఆకస్మింగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా పాఠ్యపుస్తకాలు, విద్యాకానుక కిట్లను నాణ్యతను పరిశీలించారు. అనంతరం మండలంలో ఎంతమంది విద్యార్థులు ఉన్నారు.. ఎన్ని పాఠశాలలు ఉన్నాయి.. విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు చేరాయా.. లేదా.. అని మండల విద్యాశాఖ అధికారులు కృష్ణయ్య, నారపరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌సి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చిట్స్ నడుపుతున్న ఎపిఒను సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

సమగ్ర శిక్షలో పని చేస్తూ పాఠశాలలకు వెళ్లకుండా చీటీలు, చిట్స్ నడుపుతున్న ఎపిఒ జె.నారాయణస్వామిని వెంటనే సస్పెండ్ చేయాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు యల్లన్న డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం సాయంత్రం డిఇఒను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీచర్ జె.నారాయణస్వామి దాదాపు పదేళ్లుగా పాఠశాలలకు వెళ్లకుండా ఫారిన్ సర్వీస్ కింద సమగ్ర శిక్షలో పని చేస్తున్నారన్నారు. అక్కడ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల పట్ల వివక్షత చూపిస్తూ, సాటి ఉద్యోగుల పై దురుసుగా ప్రవర్తిస్తున్నారన్నారు. గెజిటెడ్ హోదా కలిగిన ఎంఇఒలను గౌరవించకపోవడంతోపాటు ఇటీవల దళిత ఉద్యోగులను బెదిరించాడన్నారు. ఈ ఘటన నుంచి బయటపడటానికి సాటి ఉద్యోగులతో సఖ్యత ఏర్పరుచుకుని, తాము స్నేహపూర్వకంగా ఉన్నామని, పత్రికా ప్రకటన ఇవ్వడానికి అర్హత లేనప్పటికీ పత్రికా ప్రకటన ఇచ్చారన్నారు. అతను టీచర్ అయ్యి ఉండి తన ఇంటి దగ్గర చీటీ వ్యాపారం, చిట్స్ వ్యాపారంనిర్వహిస్తున్నారన్నారు. ఎవరైనా టీచర్లు చీటీలు, చిట్స్ వేయకుంటే పలు రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తుంటారని తమ దష్టికి వచ్చిందన్నారు. కావున ఏపీఓ పైన విచారణ చేసి వెంటనే సస్పెండ్ చేయాలని , అతని ఫారిన్ సర్వీస్‌ని కూడా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇందుకు డిఈవో స్పందిస్తూ... దీనిపైన విచారణ చేసి ఏపీఓపైన కఠినమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-పుట్లూరు

గాలివానకు పంటలను నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సిపిఎం, రైతుసంఘం, కౌలురైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. మండలంలో శుక్రవారం రాత్రి వీచిన గాలివానకు మండల వ్యాప్తంగా దెబ్బతిన్న పంటలను ఎపి రైతుసంఘం నాయకుల శనివారం పరిశీలించారు. మండలంలోని ఓబుళాపురం, కడపకల్లు, సంజీవపురం, చెర్లోపల్లి తదితర గ్రామాల్లో అరటితోపాటు మొక్కజొన్న, బొప్పాయి తదితర పంటలు కూడా దెబ్బతిన్నాయి. విషయం తెలుసుకున్న ఎపి రైతుసంఘం నాయకులు ఆయా గ్రామాలకు చేరుకుని దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వర్షాలకు దెబ్బతిన్న పంటలను గుర్తించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలను చేపడతామని హెచ్చరించారు. పంటలను పరిశీలించిన వారిలో ఎపి రైతుసంఘం మండల కార్యదర్శి జి.వెంకటచౌదరి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.సూరి, నాయకులు టి.పెద్దయ్య, భాస్కర్‌రెడ్డి, నాగభూషణం, రైతులు బాయినే నరసింహులు, లోకేష్‌నాయుడు, సురేంద్రబాబు, వెంకటనాయుడు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని అరకటివేముల, కడపకల్లు, సంజీవపురం, చెర్లోపల్లి, ఓబుళాపురం, మడ్డిపల్లి, సూరేపల్లి, ఎ.కొండాపురం, తదితర గ్రామాల్లో దెబ్బతిన్న బొప్పాయి, మొక్కజొన్నతోపాటు అరటిపంటలను రైతు సంఘం నాయకులు నాయకులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వి.టి.రామాంజినేయులు, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం మండల కార్యదర్శి సత్తార్, గోపాల్, మండల గౌరవాధ్యక్షులు టి.బాలగురయ్య, రైతుసంఘం నాయకులు చంద్రశేఖర్‌యాదవ్, కుళ్లాయప్పయాదవ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.చిన్నకుళ్లాయప్ప, గోపాలకృష్ణ, నాయకులు ఆంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన సిపిఎం, రైతుసంఘం నాయకులు


పంటను పరిశీలిస్తున్న ఎపి రైతుసంఘం నాయకులు

అధికారుల పరిశీలన

ఈదురుగాలులకు నేలకొరిగిన అరటి, మొక్కజొన్న, బొప్పాయి పంటలను జిల్లా ఉద్యానవన అధికారి నరసింహులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ నష్టపోయిన పంటల వివరాలను నమోదు చేసి నివేదికలు అందించాలని స్థానిక అధికారులను కోరారు. వీరి వెంట వీఆర్‌ఒలు, విహెచ్‌ఎ, విఎఎలు, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


ఆయిల్స్ బాల్స్‌ను అందజేస్తున్న కోదండ రామిరెడ్డి

వజ్రకరూరు : భారీ వర్షాలతోపాటు తుఫాన్ల కారణంగా సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉంటూ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఉరవకొండ డివిజన్ మలేరియా అధికారి కోదండరామిరెడ్డి తెలిపారు. శనివారం ఉరవకొండలో దోమల నివారణకు మురికి కాలువల్లో వేసేందుకు శనివారం ఆయిల్ బాల్స్‌ను గ్రామ కార్యదర్శులకు అందించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ దోమలు, అంటు వ్యాధులు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మండలంలోని అన్ని పంచాయతీల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగానే పంచాయతీల కార్యదర్శులు, సర్పంచులు, వైద్య, ఆరోగ్య, సచివాలయ సిబ్బంది, ఇతర అధికారులు సమన్వయం చేసుకుంటూ ప్రత్యేక పారిశుధ్య పనులు చేపడుతున్నామన్నారు.

బాధిత కుటుంబానికి 'అమ్మ' అండ

ప్రజాశక్తి-అనంతపురం

ఆపన్న హస్తం కోసం ఎదురుచూసిన బాధిత కుటుంబానికి 'అమ్మ' సంస్థ అధ్యక్షులు తరిమెల రమణారెడ్డి అండగా నిలబడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. బుక్కరాయసముద్రం మండలం దయ్యాలకుంట పల్లిలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన వడ్డే మద్దిలేటి, తన భార్య మానసకు ముగురు పిల్లలతోపాటు తల్లిదండ్రలు ఉన్నారు. ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్న మద్దిలేటి మీదనే కుటుంబం ఆధారపడి జీవిస్తోంది. అయితే గత ఏప్రిల్ 29న జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో మద్దిలేటి మృతిచెందాడు. ఇంటి యజమాని మృతిచెందడంతో భార్య, పిల్లలు, తల్లిదండ్రులు అనాథలు అయ్యారు. ఆఖరికి కుటుంబ పోషణ కూడా భారమైంది. దిక్కుతోచని స్థితిలో ఉన్న కుటుంబానికి 'అమ్మ' సంస్థ అధ్యక్షులు తరిమెల రమణారెడ్డి ఆదుకున్నాడు. విషయం తెలుసుకుని గ్రామానికి వెళ్లి దినఖర్మలు, జీవనం కోసం రూ.20వేలు, బ్యాంకు లోను రూ.35వేలు, రూ.50వేల నిత్యావసర సరుకులు అందించారు. మృతుడి భార్య మానసకు రూ.15వేల విలువజేసే కుట్టుమిషన్‌ను అందించారు. కుటుంబానికి అండగా నిలబడిన రమణారెడ్డికి మద్దిలేటి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.


ఆర్థికసాయం, నిత్యావసరాలను అందజేస్తున్న 'అమ్మ' సంస్థ అధ్యక్షులు తరిమెల రమణారెడ్డి

వైభవంగా ప్రసన్న వెంకటరమణ స్వామి కళ్యాణం

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని కోటలో వెలసిన ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయంలో శనివారం స్వామివారి కళ్యాణం వైభవంగా జరిగింది. పద్మశాలి సామాజికవర్గం అరవ కుటుంబానికి చెందిన బాలిక మౌనికను వధువును చేసి భక్త మార్కండేయ స్వామి ఆలయం నుంచి మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. అనంతరం కళ్యాణ వేదికపై పురోహితులు శాస్త్రోక్తంగా కల్యాణం చేశారు. పురోహితులు పద్మావతి ఉత్సవమూర్తికి తాళిబొట్టును తాకించి ఇవ్వగా తల్లికి ఇవ్వగా మౌనిక మెడలో కట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి అధ్యక్షులు గౌని పాలాక్షిరెడ్డి, రాయదుర్గం శాసనసభ్యులు కాపు రామచంద్రారెడ్డి, సతీమణి కాపు భారతి, రాయదుర్గం పురపాలక సంఘం అధ్యక్షులు పొరాళు శిల్ప, మాజీ అధ్యక్షులు గౌని ఉపేంద్రరెడ్డి, పాలకమండలి సభ్యులు, పురపాలక మండలి సభ్యులు, యువ నాయకులు మెట్టు విశ్వనాథరెడ్డి, పట్టణ కన్వీనర్ అరవ శివప్ప, తదితరులు పాల్గొన్నారు.


కళ్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఘనంగా ఖాజా బందే నవాజ్ ఉరుసు

గుత్తి : పట్టణంలోని కర్నూలు రోడ్డులో ఉన్న హజరత్ ఖాజా బందే నవాజ్ గ్రేస్ దాస్ దర్గా వద్ద శనివారం ఉరుసు జరిగింది. దర్గాలో ముతవల్లి హుస్సేన్ ప్రత్యేక ప్రార్థనలు చక్కెర చదివింపులు చేశారు. దర్గాలోని మదరస పిల్లల ఖురాన్‌ను చదివారు. ఆదివారం జియారత్ జరగనున్నట్లు దర్గా కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ నాయకులు అఫ్జల్, బాషా, జలీల్, రషీద్, షఫీ, రఫీ, తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ విద్యార్థులకు ఉద్యోగావకాశాలు

వజ్రకరూరు : ఉరవకొండ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్న ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉద్యోగావకాశాల కోసం శనివారం కళాశాలలో ఉద్యోగ విజయోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ఆశ్రఫ్ అలీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రాంగణ నియామకంలో రాయల్ ఎన్‌ఫీల్డ్ ఫర్ అకాడమిక్ స్కిల్ చెన్నై వారు 42 మంది విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేశారు. మెగా ఇంజనీరింగ్ ఇన్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీ ఒక విద్యార్థిని ఎంపిక చేసుకుందన్నారు. ఈ కార్యక్రమంలో 400 కెవి సబ్‌స్టేషన్ ఉరవకొండ ఎఇ రమణమూర్తి, ఇఇఇ శాఖాధిపతి సురేష్‌బాబు, కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.



ఉద్యోగాలు పొందిన విద్యార్థులు

మహేశ్వరి పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-వజ్రకరూరు

నిబంధనలకు విరు ద్ధంగా అక్రమ కట్టడాలు నిర్మిస్తున్న మహేశ్వరి ఇంగ్లీష్ మీడియం పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఆర్ఎస్‌వైఎఫ్ జిల్లా కన్వీనర్ చిరంజీవి కో కన్వీనర్ భీమేష్ డిమాండ్ చేశారు. శనివారం ఉరవకొండలోని మండల విద్యాశాఖ కార్యాలయం వద్దకు చేరుకుని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో ఉన్న మహేశ్వరి ప్రయివేట్ హైస్కూల్ ప్రస్తుతం జి-ప్లస్ 5 పద్ధతిలో భవనాలు నిర్మిస్తోందన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో జి-ప్లస్ 3 కు మాత్రమే పర్మిషన్ ఉంటే జి-ప్లస్ 5 భవనాలను ఎలా నిర్మిస్తారని ప్రశ్నించారు. అదికూడా పెద్ద కాలువ గట్టుపై భవనాలను నిర్మిస్తున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడన్నారు. దీనికి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి రూ.వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తూ దోపిడీకి పాల్పడుతోందన్నారు. కావున వెంటనే ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని యాజమాన్యంపై తక్షణం చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో దశలవారీగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

హిందీ సప్లిమెంటరీకి 90శాతం గైర్హాజరు

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

పదవ తరగతి హిందీ సప్లిమెంటరీ పరీక్షకు 90శాతం మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్షలు విభాగం ఎ.సి గోవింద నాయక్ తెలిపారు. శనివారం జిల్లావ్యాప్తంగా 45 సెంటర్లలో నిర్వహించిన హిందీ పరీక్షకు 1680 మంది హాజరు కావాల్సి ఉండగా కేవలం 170 మంది మాత్రమే హాజరైనట్లు తెలిపారు.

ఆయా పరీక్ష కేంద్రాలను జిల్లా విద్యాశాఖ అధికారిణి బి.వరలక్ష్మి తనిఖీ చేశారు. ఈసందర్భంగా పరీక్ష కేంద్రాలలో ఏర్పాట్లపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

గొడవల జోలికి వెళ్లొద్దు..

ప్రజాశక్తి -అనంతపురం క్రైం

ఎస్పీ గౌతమి శాలి ఆదేశాలతో అనంతపురం ఒన్ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో కేంద్ర సాయుధ బలగాలచే ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ప్రధాన రహదారులు, కూడళ్లతో పాటు సమస్యాత్మక కాలనీలు, ప్రాంతాలలో కవాతు కొనసాగింది. ఈ సందర్భంగా వన్ టౌన్ సీఐ రెడ్డప్ప మాట్లాడుతూ ఏవైనా సమస్యలుంటే ఆయా స్థానిక పోలీసుల దృష్టికి తీసికెళ్లి చట్టబద్ధంగా పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. గొడవలు, అల్లర్లు జోలికెళ్లి జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. జిల్లా కేంద్రంలోని నేతాజీ నగర్ , శారదానగర్, సూపర్ స్పెషాల్టీ హాస్పిటల్ ఏరియా, ఎల్ ఐ సి కాలనీ, చిన్మయ నగర్, బైరవ నగర్ లలో కవాతు కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఒన్ టౌన్ సి.ఐ రెడ్డెప్ప, నారాయణరెడ్డి, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సి.ఐ లు ఖలీల్ అహ్మద్, విజయకుమార్ మరియు ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ బలగాలు మరియు నగర పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


నార్పలలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

జిల్లావ్యాప్తంగా ఫ్లాగ్‌మార్చ్‌లు.. అవగాహన సదస్సులు

పుట్లూరు : గొడవల జోలికి వెళ్లకుండా ప్రశాంతంగా జీవించాలని సీఐ సుబ్రమణ్యం సూచించారు. శనివారం సాయంత్రం మండలంలోని ఎ.కొండాపురంలో ఎస్ఐ హేమాద్రి ఆధ్వర్యంలో గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ గ్రామాల్లో ఏమన్నా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అలాకాకుండా గొడవలకు వెళ్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కావున ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నార్పల : ఎస్పీ గౌతమిశాలి ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ నుంచి ఎంపిడిఒ కార్యాలయం వరకూ కేంద్ర సాయుధ దళాలు శనివారం కవాతు నిర్వహించాయి. ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రధాన రహదారులు, ముఖ్యమైన కాలనీల గుండా కవాతు సాగింది. ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు ముగిసాయని, ఫలితాలు వచ్చే వరకూ ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందన్నారు. గ్రామాల్లో ఎలాంటి కవ్వింపు చర్యలకు పాల్పడకుండా ప్రశాంత వాతవరణం కల్పించడమే పోలీసుల ధ్యేయమని తెలిపారు.

రాయదుర్గం : సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా గ్రామాల్లో శాంతిభద్రతలకు భంగం కలిగించరాదని అధికారులు కోరారు. రాయదుర్గం తహశీల్దార్ చిట్టిబాబు, పోలీస్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో శనివారం మండలంలోని మెచ్చిరి, పల్లేపల్లి గ్రామాల్లో గ్రామసభలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని మెచ్చిరి, పల్లేపల్లి గ్రామాల్లో సమస్యాత్మక గ్రామాలు రికార్డుల్లో ఉన్నాయన్నారు. ఆయా గ్రామాల ప్రజలు ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి గొడవలు, అల్లర్ల జోలికెళ్లకుండా ప్రశాంతంగా మెలగాలన్నారు.


అనంతపురంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ఆత్మకూరు : ఎస్పీ గౌతమీశాలి ఆదేశాల మేరకు మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా శనివారం మండలంలోని సిద్దరాంపురం, ఆత్మకూరు, గోరిదిండ్ల, ముట్టాలలో ఫ్లాగ్‌మార్చ్‌తోపాటు గ్రామసభలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మునీర్‌అహ్మద్ మాట్లాడుతూ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో ఈనెల 4న కౌంటింగ్ ఉన్న సందర్భంగా ఎలాంటి అల్లర్లు, గొడవలకు పాల్పడకుండా ప్రశాంతంగా ఉండాలన్నారు. ముఖ్యంగా బాణసంచా కాల్చడం, విజయోత్సవ ర్యాలీ నిర్వహించడం నిషేధం అన్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

కిశోర బాలికలు బలమైన ఆహారం తీసుకోవాలని సూపర్‌వైజర్లు నారాయణమ్మ, రామలక్ష్మి అన్నారు. శనివారం మండలం పరిధిలోని ముచ్చుకోట, బొందలదిన్నె అంగన్వాడీ కేంద్రాల్లో కిషోర్ బాలికలు పౌష్టికాహారం తీసుకోవాల్సిన ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కిషోర్ బాలికలకు రక్తహీనత లేకుండా చూసుకోవాలన్నారు. అంతేగాకుండా ప్రతినెలలో జరిగే రుతుక్రమంపై అపోహలు ఉండకూడదన్నారు. రక్తహీనత లేకుండా పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. కాగా బాల్యవివాహాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. 18ఏళ్లు నిండిన తర్వాతనే వివాహాలు చేయాలన్నారు. అలాకాకుండా బాల్యవివాహాలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కిషోర్ బాలికలు, అంగన్‌వాడీలు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు

పోలీసు హెడ్‌క్వార్టర్స్ తనిఖీ

అనంతపురం క్రైం : అనంతపురం పోలీసు హెడ్ క్వార్టర్స్ లో నిర్వహిస్తున్న వివిధ విభాగాలను జిల్లా ఎస్పీ గౌతమిశాలి శనివారం సందర్శించారు. ఆయా విభాగాల నిర్వహణ ఎలా కొనసాగుతుందో అడిగి తెలుసుకున్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని స్పెషల్ బ్రాంచి, ఐ.టి కోర్ టీం, డీసీఆర్బీ, డిపిఓలోని వివిధ విభాగాలు మరియు ఎలెక్షన్ సెల్, పోలీస్ కంట్రోల్ రూం, ఈ సర్వేలెన్స్, సైబర్ సెల్, డయల్-100 విభాగాలను జిల్లా ఎస్పీ గారు సందర్శించి అక్కడి సిబ్బంది పని తీరు, నిర్వహణపై ఆరాతీశారు. సిబ్బందితో మాట్లాడి వారి విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. సమయపాలన పాటిస్తూ కేటాయించిన పనులను సకాలంలో పూర్తి చేసేలా శ్రమించాలని సూచించారు. ఎస్పీతోపాటు అదనపు ఎస్పీ ఆర్ విజయభాస్కర్‌రెడ్డి, స్పెషల్ బ్రాంచి సి.ఐలు జాకీర్‌హుస్సేన్, ఇందిర, ఆయా విభాగాల పోలీసులు ఉన్నారు.


హెడ్ క్వార్టర్స్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ గౌతమిశాలి